క్లుప్తంగా

'ష్.. కోడ్ ఉంది.. వినండి.. ఏమీ అడగకండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ

యలమంచిలి: 'ష్.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉంది.. కేవలం అధికారులు చెప్పింది వినండి.. ప్రశ్నలు ఏమీ అడగకండి' అంటూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలకు ఒకసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలనే నిబంధన ఉంది. గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ నెల 9వ తేదీతో మూడు నెలల గడువు ముగిసిపోనుండటతో తప్పనిసరిగా సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండుటతో కలెక్టర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో శాఖల వారీగా సమీక్ష వరకే సమావేశాన్ని పరిమితం చేశారు. అన్ని శాఖల అధికారులు వచ్చి గత మూడు నెలల కాలంలో తమ శాఖల ఆధ్వర్యంలో చేసిన పనుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా ర్యాలీ

నరసాపురం: వైఎన్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సమైక్యతా శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. 12 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. మంగళవారం పట్టణంలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశమంతా ఒకటే, ప్రజలంతా ఒకటే అనే భావన అందరిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.చింతారావు, హెచ్ఆర్డీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ చినిమల్లి శ్రీనివాస్, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత

పాలకొల్లు సెంట్రల్: గత 30 ఏళ్లుగా షాపులో పనిచేస్తున్న వ్యక్తిని ఆ షాపు యజమాని పనిలో నుండి తొలగించడంతో రోడ్డున పడ్డ ఆ కుటుంబానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అండగా నిలిచారు. మంగళవారం తాతాజీ మైనార్టీ కుటుంబం అయిన హుస్సేన్, షాదియా దంపతులకు తోపుడు బండి అందజేశారు. కుటుంబ పోషణార్థం రోడ్డుపై డబ్బాలు పెట్టుకుని అమ్ముకుంటున్న హుస్సేన్ కుటుంబానికి తాతాజీ తోపుడు బండి అందజేసి బిస్కెట్లు, టీ స్టాల్ ఏర్పాటుచేసుకోవడానికి చేయూతనందించారు. మైనార్టీ పెద్దలు ముషారఫ్, షేక్ భాషా, షేక్ వల్లి, కావలి శీను, జోగాడ ఉమామహేశ్వరరావు, కొర్రగింజల శ్రీను, చెన్ను విజయ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి రంగరాజుకు కృతజ్ఞతలు

పెనుగొండ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న తనను వైద్య సహాయం అందించి ఆదుకొన్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ఇలపర్రు యువకుడు గుమ్మడి రవీంద్ర మంగళవారం తూర్పుపాలెంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు నిలవవని వైద్యులు తెలిపిన తరుణంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు స్వయంగా కలుగుజేసుకుని గుంటూరులోని జీజీహెచ్‌లో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రవీంద్ర మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరించారు. కార్యక్రమంలో పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ఎంపీటీసీ పడపట్ల పద్మ నాగేశ్వరి, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వర్లు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని అరికట్టేందుకు చర్యలు

నరసాపురం రూరల్: దాళ్వా వరిసాగులో నీటి ఎద్దడిని నివారించే చర్యల్లో భాగంగా అనధికారికంగా ఆక్వా చెర్వులకు వినియోగిస్తున్న నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. ఆయన రెవిన్యూ సిబ్బందితో కలసి మంగళవారం నరసాపురం మండంలోని కొప్పర్రు, సీతారామపురంసౌత్ గ్రామాల్లో పంట కాలువల వెంబడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంటకాలువలోని నీటిని అక్రమంగా ఆక్వా చెరువులకు ఇంజిన్ల సాయంతో తోడుతున్న వాటిని గుర్తించారు. నీటిని తోడేందుకు వినియోగిస్తున్న ఇంజన్లను సీజ్ చేయడంతో పాటు డి.మహేశ్వరరావు, రావి శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులపై నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళలే మహారాణులు



జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలలో ఉపాధ్యాయినులను సత్కరించిన సభ్యులు



మహిళా శాస్త్రవేత్తలు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో పరిశోధనా సంచాలకులు డా. శ్రీనివాస్

- ఉత్సాహంగా మహిళా దినోత్సవం
- పలు చోట్ల సత్కారాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిట్టల శైలజ మాట్లాడుతూ ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అని పురుషులతో సమానంగా స్త్రీలు కూడా పోటీ ప్రపంచంలో ముందుకు వెళుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు బొక్కా భవానీ, చంద్రకళ, రాజేశ్వరి, పీఎంసి చైర్మన్ కొత్తల వెంకట కుమారిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రూరల్ అధ్యక్షులు గూడూరు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులపై వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవి సుబ్బారావు, ఆనందరాజు, ప్రసన్నకుమార్, ఆర్ ప్రభాకర్, శ్రీనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మొదటి బ్యాచ్‌కు చెందిన గోటేటి లక్ష్మీ అలివేలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలివేలు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం కళాశాలలో వసతులు తక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల దీక్షతో ఉన్నత విద్యనభ్యశించి నేడు ఈ స్థాయికి చేసుకున్నామన్నారు. తాను ప్రస్తుతం ఏపి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ సెక్రటరీగా అమరావతిలో పనిచేస్తున్నాన్నారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షురాలు నాగలక్ష్మి, సిపిసిపిడిసి సభ్యులు మైధిలి పాల్గొన్నారు.



మహిళలకు టైలరింగ్ శిక్షణను ప్రారంభించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు



లక్ష్యసాధన కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

ఆడపిల్లల జీవితంలో అత్యంత ప్రభావితం చేసే వయస్సు కాలేజీ రోజులేనని లయన్స్ ఫెమినా క్లబ్ అధ్యక్షురాలు ఎస్ వసంతలక్ష్మి తెలిపారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, క్లబ్ సెక్రటరీ మీనా మణిదీప్తి, డాక్టర్ మౌని, యామిని పాల్గొన్నారు.

మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి

పెనుమంట్ర: ప్రస్తుతం ప్రభుత్వాలు మహిళా సాధికారితకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ దేశాభివృద్ధికి దోహద పడుతున్నాయని అందుకు అనుగుణంగా మహిళలు కూడా అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డా. టి శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వరి పరిశోధనా స్థానంలో జరిగిన మహిళా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు పోటీ పరీక్షల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణతా శాతం సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డా. దక్షిణామూర్తి, ఎం శ్రీనివాస్, వై సతీష్, డా.ఆనంద కుమార్, డా.అనూష పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాల అవసరం

మొగల్తూరు: మహిళలకు శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పుగాకు పూర్ణ ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ కరువైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. ఈసమావేశంలో స్వర్ణ, అజయ్ కుమారి పాల్గొన్నారు.

వీఏఏ ప్రతిభ

నరసాపురం రూరల్: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన పరుగుపందెం పోటీల్లో నరసాపురం డివిజన్‌లోని యలమంచిలి మండల వ్యవసాయశాఖ సహాయకురాలిగా పని చేస్తున్న ఈద హిమజ్యోతి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళలకు ఈ పోటీలు నిర్వహించారు. పరుగుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలచిన హిమజ్యోతిని ఏడీఏ అనిల్‌కుమారి, వ్యవసాయశాఖాధికారులు అభినందించారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

పోడూరు: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా రాణించాలని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు పిలుపునిచ్చారు. కొమ్ముచిక్కాల గ్రామంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరామరాజు మాట్లాడుతూ సమాజానికి స్ఫూర్తిదాయకమైన సేవలు అందించడమే వసుధ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, గుంటూరి చంటిరాజు, రుద్రరాజు సుజాత, గుంటూరి భారతి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సాంకేతికంగానూ అభివృద్ధి చెందాలి



మహిళలు సాంకేతికంగానూ పురుషులతో సమానంగా పోటీపడాలి. ప్రపంచ జనాభాలో సగంమంది పైగా మహిళలు ఉన్నా సాంకేతికంగా 259 మిలియన్ల మహిళలు అంటే 37 శాతం మంది మహిళలు ఇంటర్నెట్ ఉపయోగించడం లేదు. మహిళలు ఇంటర్నెట్ ఉపయోగించలేకపోయినా, ఆన్‌లైన్ సురక్షితంగా చేయలేకపోయినా అటువంటి వారికి డిజిటల్ స్పేస్‌పై అవగాహన కల్పించాలి.

– టి.రాజరాజేశ్వరి, ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాలకొల్లు

మహిళలే ముందుంటున్నారు



రాజ్యాంగం కల్పించిన హక్కుల రీత్యా మహిళలు అన్ని రంగాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. నేడు పురుషుల కన్నా మహిళలే ఒక రకంగా ఎక్కువ అవగాహనతో ఉండడం శుభపరిణామం. పురుషులు ఉద్యోగం చేస్తూ ఒక బాధ్యతనే నిర్వర్తిస్తుంటారు. అదే ఉద్యోగాల్లో ఉన్న మహిళలు అటు కుటుంబానికి ఇటు ఉద్యోగ బాధ్యతలు రెండికి సమన్యాయం చేస్తూ ఎక్కువ బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది.

– కె. పూర్ణిమా నాగదేవి, తహసీల్దార్, పాలకొల్లు

ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలి



ప్రతీ మహిళా ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలి. చదువు అనే ఆయుధం ద్వారా ఇది సాధ్యమవుతుంది. నేను చదువుకుని ఉద్యోగం చేయడం వల్లనే పిల్లల్ని కూడా మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దుకోగలిగాను అదే విధంగా ప్రతీ మహిళ తమ పిల్లకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలి. ఆడపిల్లంటే భారంగా భావించకూడదు. 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలి. ప్రతీ చిన్న అవసరానికి భర్తమీద ఆధారపడకూడదు. ప్రతీ యువతీ ఆర్థికంగా స్థిరపడాలి.

– కలిగితి జ్యోతిరాణి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్, డీఆర్‌డీఏ

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం



సిద్ధాంతంలోగడపగడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో సంక్షేమ పథకాల కొనసాగింపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరికే సాధ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం పెనుగొండ మండలం సిద్ధాంతంలోని నక్కావారి పాలెం, బూరుగులంక, పెదపేటల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించిన పేదలకు అందిన సంక్షేమాన్ని వివరించి సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఏనాడు ఇచ్చిన హామీలు నెరవేర్చిన సంఘటనలే లేవన్నారు. దీనికి తార్కాణం రైతు రుణమాఫీయేనన్నారు. పూర్తి రుణమాఫీ అని ప్రజలను మోసగించి అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకొన్నారని గుర్తు చేశారు. సీఎం జగన్ దీనికి భిన్నంగా ఇచ్చిన మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కరోనా వంటి క్లిష్టసమయంలో రాష్ట్రానికి మూడు సంవత్సరాలుగా ఆదాయం తగ్గినా సంక్షేమం ఎక్కడా నిలపకుండా అమలు చేసిన ఘనతను దక్కించుకొన్నారన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలు సైతం అమలు చేశారన్నారు. ఇప్పటి వరకూ అందిస్తున్న సంక్షేమం కొనసాగించాలన్నా, మరింత సంక్షేమం అందించాలన్న సీఎం జగన్‌కే సాధ్యమని ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, పెనుమంట్ర ఎంపీపీ కేఎస్ నారాయణ రెడ్డి(వాసు), ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఎంపీటీసీ సభ్యులు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, కర్రి అనురాధ జోగిరెడ్డి, ఈధి అనిత, పెనుగొండ లక్ష్మీ, వాసంశెట్టి కిరణ్, గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, గెడ్డం ఈశ్వరుడు, షేక్ రిజ్వానా, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), యర్రంశెట్టి బుజ్జి, గూడూరి దేవేంద్రుడు, బుర్రా రవికుమార్, దాట్ల చంటిలు, సొసైటీ ఛైర్ పర్సన్స్ బలువు కృష్ణమూర్తి, కేశవరపు గణపతి, మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి (బాబీ), పట్టణ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నరసాపురం రూరల్: మైనర్ బాలికకు వివాహం చట్ట విరుద్ధమని అలా చేసేవారు శిక్షార్హులవుతారని తహసీల్దార్ ఫాజిల్ పేర్కొన్నారు. నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ గ్రామంలో శెట్టిబలిజ కుటుంబానికి చెందిన పదో తరగతి చదువుకునే మైనర్ బాలికలకు ఈ నెల 17న వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలుసుకుని ఐసీడీఎస్, పోలీసు సిబ్బందిలో తహసీల్దార్ ఫాజిల్ అక్కడకు వెళ్లి పెళ్లికి సంబంధించిన ఇరుపక్షాలకు తల్లిదండ్రులతోను, కుల పెద్దలతో మాట్లాడారు. దీంతోవా రంతా వివాహ ఏర్పాట్ల రద్దుకు అంగీకరించారు. ఎవరైనా మైనర్లకు వివాహాలు చేసేందుకు ప్రోత్సహిస్తే శిక్షార్హులవుతారని అలాంటి వారిపై కేసులు నమోదుచేస్తామని తహసీల్దార్ ఫాజిల్ హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కృపారాజు, వీఆర్వో భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



లిఖితపూడిలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో జీవ ధ్వజ స్థంభ ప్రతి సంకల్ప పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చండీహోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ చండీహోమం కార్యక్రమంలో 22 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణలు భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

మొగల్తూరు: స్థానిక కోట ప్రాంతంలో ఉన్న శ్రీమరిడీ మహాలక్ష్మి అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, ఘటాల ఊరేగింపు నిర్వహించారు. మొగల్తూరు కోట సంస్థానాదీశుల కాలం నుంచి నిత్యం అమ్మవారిని పూజించి ప్రతీ ఏటా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజు రాత్రి వేకువ జామున అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఆరు రోజులు పాటు అమ్మవారి జాతరను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

కనకదుర్గమ్మకు త్రిశూలస్నానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి పూర్ణాహూతి, దండాడింపు ఉత్సవము, త్రిశూలస్నానం కార్యక్రమాలు అత్యంత వైభవంగా చేశారు. ఉదయం అమ్మవారిని పట్టణంలో ఊరేగించి నరసాపురం గోదావరి గట్టున త్రిశూల స్నానం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి కుంపట్ల నాగశ్రీనివాస్, కామేశ్వరి, గుమ్మళ్ల లక్ష్మీనారాయణ, పెద్దిలక్ష్మి దంపతులతో అమ్మవారికి లక్ష చామంతి పువ్వుల పూజా కార్యక్రమం నిర్వహించారు.

దుర్గామల్లేశ్వరస్వామివార్ల పల్లకీ సేవ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – మార్టేరు ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకీ సేవ నిర్వహించారు. కల్యాణమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ లలిత పారాయణ కమిటీసభ్యులు ఉత్సవ మూర్తుల పల్లకీని స్వయంగా మోశారు. అల్లు శ్రీనివాసరావు–ఉమాదేవి దంపతులు, ఆలయ ధర్మకర్త ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

పుష్ప యాగోత్సవం

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పాలకుడు జనార్ధన స్వామి పుష్పయాగోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి పూజలు, అభిషేకంలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వ హించారు. సాయంత్రం కోలాట, భజన మండలల ఆధ్వర్యంలో కనుల పండుగగా భజనలు, నృత్యాలు నిర్వహించారు. అనంతరం పుష్పయాగోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాసవీ ఆలయంలో జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో జీవ ధ్వజ స్థంభ సంకల్ప పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోయంబత్తూరు వాసవీ తిరుప్పన్ కమిటీ సహాయ సహకారంతో నూతన జీవ దవజ స్థంభ ప్రతిష్ఠాకార్యక్రమాలు స్మార్త ఆగమ విధానంగా రామడుగుల లక్ష్మీ నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు కోట వెంకట సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, గోపూజ, దీక్షాదారుణ, వాస్తు పూజలు నిర్వహించారు.

భక్తాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు.

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో మంగళవారం శ్రీ భక్తాంజనేయస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా శ్రీమాన్ సుదర్శనం శేషాచార్యులు సిద్ధాంతితో అడబాల శ్రీవెంకటరామాంజనేయులు, పద్మశ్రీ దంపతులు ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు లంకలపల్లి మణికంఠ, లంకలపల్లి నాగేశ్వరరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం 7.03 గంటలకు శ్రీ భక్తాంజనేయ, పంచలోహ శ్రీ సీతారామ, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రకమాలు జరుగుతాయని, అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నచిన్న చేపల పెంపకంతో రైతులకు లాభం



లంకలకోడేరులో చెరుకు పంటను పరిశీలిస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ ఫిషరీస్ (ఒరిస్సా) శాస్త్రవేత్తలు

పాలకొల్లు అర్బన్: చిన్న చిన్న చేపలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని డైరెక్టరేట్ ఆఫ్ ఫిషరీస్ (ఒరిస్సా) శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ పడియార్, డాక్టర్ అయాన్ వెల్లడించారు. సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న పలు గ్రామాల్లోని పంటలను మంగళవారం పరిశీలించారు. కాపవరంలో జీవామృతం వినియోగించి చేపల సాగు చేస్తున్న గుత్తుల సుబ్బారాయుడు చేపల చెరువును శాస్త్రవేత్తలు పరిశీలించారు. అలాగే అరట్లకట్టలో సేంద్రీయ విధానంలో అంతర పంటల సాగును పరిశీలించారు. లంకలకోడేరులో రైతు పెన్మెత్స రామసూర్యనారాయణరాజు (రామసూరి) సాగు చేస్తున్న చెరకు, కాయగూరలు, మినుము పంటలను పరిశీలించి రైతుని ప్రత్యేకంగా అభినందించారు. రైతు రామసూరి సాగు చేస్తున్న సేంద్రీయ విధానాన్ని శాస్త్రవేత్తలు అడిగి తెలుసుకున్నారు. చింతపర్రు రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం డీపీఎం వై.నూకరాజు అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, కోఆర్డినేటర్ వీరాస్వామి, డివిజన్ ఇన్‌చార్జ్ అప్పారావు, వీఏఏ సాయిమణి తదితరులు పాల్గొన్నారు.

3.4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పాలకొల్లు అర్బన్: దగ్గులూరు శివారు గవరపేటలో మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ పి శివరామకృష్ణ స్వాదీనం చేసుకున్నారు. మారుతీ పౌల్ట్రీ ఫారమ్‌లో 69 ప్లాస్టిక్ సంచులతో నిల్వ చేసిన రూ.62,100 విలువైన 3,450 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి గుత్తి బసవలింగంపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ చెప్పారు. సీఎస్‌డీటీ ఏవీవీ సత్యనారాయణ విజిలెన్స్ దాడిలో పాల్గొన్నారు.